క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమంగళారం విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు హీరా కాలనీ, సన్‌సిటీ మెయిన్‌రోడ్, సీవైఆర్ కన్వెన్షన్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిలానగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మిలట్రీ-2 ఫీడర్ పరిధిలోని సన్‌సిటీ, పీఅండ్‌టీ కాలనీ, ఏబీసీడీ బ్లాక్స్, స్పెషల్ బ్లాక్, మాపిల్‌టౌన్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, హైదర్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో మరమ్మల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మార్కండేయనగర్ ఎల్లమ్మ దేవాలయంలో చోరీ



ఎల్లమ్మ దేవాలయంలో చెల్లాచెదురైన వస్తువులు

మైలార్‌దేవ్‌పల్లి: ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ ప్రధాన రహదారిపై ఉన్న ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారిపై ఉన్న నగలు, ఆలుమార పగులగొట్టి అందులోని విలువైన వస్తువులను చోరీ చేశారు. ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన కాలనీ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.లక్ష విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


గజ లక్ష్మి రూపంలో అమ్మవారి దర్శనం



గజ లక్ష్మి రూపంలో అమ్మవారు

మైలార్‌దేవ్‌పల్లి: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మూడో రోజు అమ్మవారు గజ లక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రతి రోజు కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వివేక్ తెలిపారు.

ఎర్రకుంటలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు మంగళవారం వెలికి తీశారు. సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ ఎర్రకుంట చెరువులో సోమవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఉన్న గుర్తు తెలియని మూత్ర విసర్జన చేస్తుండగా కాలు జారి చెరువులో పడిన విషయం తెలిసిందే. డీఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి గాలింపు చేపట్టిన పోలీసులు మంగళవారం అతడి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో వలస కార్మికుడై ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎవరైన అతడిని గుర్తు పడితే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మధు కోరారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో సిబ్బంది చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీ ఉపేందర్ రెడ్డి, రామ్‌కీ బృందం, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

చోరీలకు పాల్పడుతున్న అన్నదమ్ముల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అన్నదమ్ములను రాజేంద్రనగర్ సీసీఎస్, శంకర్‌పల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు స్మార్ట్ గడియారాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ జగదీశ్వర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, కంది మండలం, కవివేముల గ్రామానికి చెందిన రాజు గౌడ్ పాత నేరస్తుడు. ఇతడిపై 31 కేసులు ఉన్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. జైలు నుంచి బయటికి వచ్చిన రాజు తన సోదరుడు శివ గౌడ్‌తో కలిసి నేరాలను ప్రారంభించాడు. ఈ నెల 12న శంకర్‌పల్లి ప్రాంతంలోని వంశీధర్ రెడ్డి ఇంటి తాళాలను పగలగొట్టి 9.5 తులాల బంగారు అభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాత నేరస్తుల వివరాలను పరిశీలించగా రాజు గౌడ్, శివ గౌడ్‌లపై అనుమానంతో వారిపై నిఘా పెట్టారు. మంగళవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి వద్ద వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నాలుగు, పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వారి నుంచి బైక్, రెండు స్మార్ట్ వాచ్‌లు, 19 తులాల బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాజు గౌడ్‌పై 31, శివ గౌడ్ 7 కేసులు నమోదయ్యాయన్నారు. రాజు గౌడ్‌పై పీడీ యాక్ట్ నమోదుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు డీసీపీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన శంకర్‌పల్లి పోలీసులు, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులను డీసీపీ అభినందించారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలి



పట్టాలు అందుకుంటున్న యువ శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: యువ శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, రైతులకు సరమైన ధరలకు సరైన పరిజ్ఞానాన్ని అందించాలని అప్పుడే 'అమృత్ కాల్' లక్ష్యాన్ని చేరుకుంటామని నారమ్స్ మాజీ డైరెక్టర్ జనరల్ బీఎన్ మాథూర్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని నారమ్స్‌లో 113వ వ్యవసాయ పరిశోధన సేవా ఫౌండేషన్ కోర్సు ముగింపు సమావేశం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువ శాస్త్రవేత్తలకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అత్యుత్తమమైన ఉత్పాదక పరిశోధనల పై దృష్టి సారించాలి శాస్త్రవేత్తల కోరారు. నారమ్స్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 113 వ శాస్త్రవేత్తల బ్యాచ్‌లో 69 మంది తమ శిక్షణ పూర్తి చేసుకున్న 21 రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. వారిలో 27 మంది మహిళా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉండటం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన యువ శాస్త్రవేత్తలు సమాజాభివృద్ధికి చేయాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డీడీ డాక్టర్ ఆర్ సీ అగర్వాల్, నారమ్స్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ విజయ్ అవినాశలింగం, డాక్టర్ యశ్వంత్ నారమ్స్ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు ,అధికారులు పాల్గొన్నారు.

ప్రజల కంటి సంరక్షణకు కృషి



మణికొండలో మాక్సి విజన్ కంటి ఆసుపత్రిని ప్రారంభించిన సంస్థ కో చైర్మన్, సీఈఓ, ఎండీలు

మణికొండ: దేశ వ్యాప్తంగా అధునాతన కంటి ఆసుపత్రులను నెలకొల్పి ప్రజలందరికి తక్కువ ధరలో కంటి సంరక్షణను అందించేందుకు కృషి చేస్తున్నామని మాక్సి విజన్ కంటి ఆసుపత్రుల వ్యవస్థాపకుడు, చీఫ్ మెంటర్, కో చైర్మన్ డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మణికొండలో ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల్లో 14నుంచి 45 ఆసుపత్రులకు పెంచామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలల్లోనూ మరిన్ని శాఖలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా అనేక శాఖలు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయని, వచ్చే సంవత్సరం మార్చి లోపు వంద శాఖలకు విస్తరించాలనే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. తమ ఆసుపత్రుల్లో కంటి శుక్లం, గ్లకోమా, రెటినా, కార్నియా, ఒక్యులో ప్లాస్టీ, లాసిక్ విధానాలతో సహా అనేక రకాల కంటి సమస్యల పరిష్కారానికి అధునాతన సాంకేతికతలతో సేవలు అందిస్తున్నామన్నారు. తమ సంస్థకు న్యూబెర్గ్ ల్యాబ్స్ కేంద్రాలతో పూర్తి స్థాయి పాథాలజీ సేకరణ కేంద్రాలను నిర్వహిస్తుందన్నారు. అనుభవజ్ఞులైన ప్రపంచ స్థాయి డాక్టర్లు తమ వద్ద అందుబాటులో ఉన్నారన్నారు. పేదలకు ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీ డాక్టర్ శరత్‌బాబు, సీఈఓ వీఎస్ సుధీర్ తమ సంస్థ సాధించిన ఫలితాలతో పాటు రాబోయే రోజుల్లో సంస్థ విస్తరణ వివరాలను వెల్లడించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుధ్య కార్మికులు అనునిత్యం తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ అన్ని ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం ఆయన 11,12వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా పారశుద్ధ్య కార్మికుల విధులు, చెత్త సేకరణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పనులు చేసే సమయంలో తప్పనిసరిగా మాస్క్, గ్లౌజ్, రిఫ్లెక్టింగ్ జాకెట్స్‌ను వినియోగించాలన్నారు. చెత్త సేకరణ కార్మికులు ప్రతి రోజు ఇంటి వద్దకు వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి చెత్తను రోడ్లపై వేయకుండా సూచించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు ప్రతి రోజు చెత్తను ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేందుకు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు తౌఫిక్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి...

100 శాతం చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికులు డోర్ టూ డోర్ వెళ్లి చెత్తను సేకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు మంగళవారం ఆయన 6,7,8 డివిజన్లలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్మికులు ప్రతి రోజు వచ్చి చేసే పనులు, హాజరు, పని చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారా లేదా తదితర అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు సురేష్, లక్ష్మినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శంషాబాద్ రూరల్: ముప్పై రెండేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివినవారంతా ఒక్కచోట చేరి నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మండల పరిధిలోని చిన్నగోల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో 10వ తరగతి చదివినవారు మంగళవారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తోటి పూర్వ విద్యార్థి గొల్లపల్లికి చెందిన సిద్దులుకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సార కృష్ణగౌడ్, పులిజాల సుధాకర్‌గౌడ్, బోయిని రవీందర్, ఇ.అమరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ సమస్యలపై మంగళవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో చర్చించినట్లు డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తెలిపారు. శివరాంపల్లిలోని తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ... డివిజన్‌లోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ప్రకాశ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఎన్నికల అనంతరం డివిజన్‌లో పర్యటించి మరిన్ని నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలి



అధికారులు, సిబ్బందితో సమావేశమైన రాజేంద్రనగర్ డీఈ పి.రత్నాకర్ రావు.

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే సిబ్బంది స్పందించి పరిష్కరించాలని రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం శివరాంపల్లిలోని డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో వినియోగదారులు ఫిర్యాదులకు స్పందించినప్పుడే మంచి పేరు రావడంతో పాటు సేవలు అందించిన వారవుతామన్నారు. సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సేఫ్టీ పరికరాలను ధరించి పని చేయాలని సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన జూనియర్ లైన్‌మెన్‌లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు తమ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే ప్రాంతాల వారీగా మోబైల్ నంబర్లు ఇచ్చామని ఆయా నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలు సెక్షన్ అధికారులు, సిబ్బందికి వివరించాలన్నారు. ఈ కింద నంబర్లు ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) కాల్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని డీఈ తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు సత్యనారాయణ, ఈశ్వర్ ప్రసాద్, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాస్ రెడ్డి, హరినాథ చారి, జుబేరుద్దీన్, హథిరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు

1) గగన్‌పహాడ్-9493193100
2) కాటేదాన్-9493193103
3) మైలార్‌దేవ్‌పల్లి-9493193102
4)రాజేంద్రనగర్-9493193105.
5)హిమాయత్‌నగర్-8688749801.
6) శివరాంపల్లి-9493193104
7) శంషాబాద్-9493193108

బతుకమ్మ వేడుకల్లో మతసామరస్యం



ఆడిపాడుతున్న మహిళా కానిస్టేబుళ్లు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ముస్లిం మహిళలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో సిరీ ఉమెన్స్ వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మినీ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మతసామరస్యం విలసిల్లింది. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సుష్మతో స్థానిక ముస్లిం మహిళలు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటారు.. మరో వైపు మహిళా కానిస్టేబుళ్ల సైతం ఉత్సాహంగా ఆడిపాడారు.. సంప్రదాయ వేడుకలు మన సంస్కృతిని ప్రతిభింబిస్తాయని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

శంషాబాద్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం బాలభోగం, నిత్యహోమం కార్యక్రమాల అనంతరం శ్రీవారి కల్యాణాన్ని వేద పండిత మంత్రోచ్చారణాలతో పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి



గురువయ్య మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి: టిప్పర్ ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.జల్‌పల్లి సబితాఇంద్రారెడ్డి కాలనీకి చెందిన పూరి గురువయ్య(52) సిగరెట్లు కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం కంపెనీకి వెళ్లి తిరిగి వస్తూ దుర్గానగర్ చౌరస్తాలో సిగ్నల్ పడటంతో ఆగాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బంగారం

శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం రస్‌అల్‌ఖైమా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో ఉన్న ప్యాంట్‌ను పరిశీలించి చూడగా అందులో దాచి తీసుకొచ్చిన175 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ.10.82 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. జెద్దా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడిని తనిఖీ చేయగా లో దుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన 650 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.39.61 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన గండయ్య

శంషాబాద్ రూరల్: బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లి కరెంటు షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రాయన్నగూడలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు కుమ్మరి గండయ్య(60) మంగళవారం ఉదయం పొలానికి వెళ్లాడు. వరి చేనుకు నీరు పారించేందుకు బోరు మోటారు స్టార్ట్ చేసేందుకు వెళ్లగా స్టార్టర్ డబ్బాకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం వరకు గండయ్య ఇంటికి రాకపోవడంతో కుమారుడు నర్సింహ అక్కడికి వెళ్లి చూడగా అతను మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అగ్రి బిజినెస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తమ గురువులతో పూర్వ విద్యార్థులు


ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలోని స్కూల్ ఆఫ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీలో 2000 సంవత్సరంలో స్కూల్ అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభించారు. ఇప్పటి వరకు 20 బ్యాచ్‌ల విద్యార్థులు ఈ కోర్సు పూర్తి చేసి వివిధ రంగాల్లో అగ్రి కంపనీలలో మేనేజర్లుగా , వ్యవసాయ అధికారులుగా వ్యవసాయ అనుబంధ రంగాలు, బ్యాంకుల్లో మేనేజర్లుగా పని చేస్తున్నారు. వారందరూ ఒకే చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రాధిక,అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలత, పూర్వ విద్యార్థులు హేమ, వసంతరావు, లక్ష్మినారాయణ, రామోదర్, ప్రవీణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రిదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాంబాగ్ దుర్గామాత దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర సేవికా సమితి జనరల్ సెక్రటరీ శ్రీపాద రాధ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింధూ, రమ, పద్మ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర సేవికా సమితి జనరల్ సెక్రటరీ శ్రీపాద రాధ.



దుర్గామాత పూజలో పాల్గొన్న మహిళలు

అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవి..

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని దేవాలయాలు, అమ్మవారి మంటపాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి ప్రతిమలను నెలకొల్పి అనుదినం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. మణికొండ ఓయూ కాలనీలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. దేవాలయ ఆవరణలో నిర్వహించిన చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గండిపేట గండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.



అన్నపూర్ణాదేవి అలంకారంలో ఓయూ కాలనీ దుర్గామాత



చండీహోమంలో పాల్గొన్న భక్తులు